సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మొల్లి అప్పారావును అభినందిస్తున్న కార్పొరేటర్ ముVVల లక్ష్మీ సురేష్

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితుడైన మొల్లి అప్పారావు సారథ్యంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని 20వ వార్డు కార్పొరేటర్ ముVVల లక్ష్మీ సురేష్ ఆకాంక్షించారు. సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టి నగరానికి వచ్చిన ఆయనను కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఆర్‌ఎంపీలు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదు

మహారాణిపేట: జిల్లాలోని ఆర్‌ఎంపీలు గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు అన్నారు. గర్భిణులకు ఎవరైనా నాటు వైద్యం చేసినా, ఆర్‌ఎంపీలు వైద్యం చేసినా, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిఫర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందడం వల్ల మాతా, శిశు మరణాలను నియంత్రించవచ్చన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి..

విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–2002 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం (ఆన్‌లైన్)లో రిజిస్టర్ చేసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకపోతే అటువంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్ యాజమాన్యాలు http@// clicalesttact.ap.gov.in ద్వారా, స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు https@//pcpndt.ap.gov.in ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

భూగర్భ విద్యుత్ కేబుల్ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, విద్యుత్ అధికారులు

ఎంవీపీకాలనీ: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–7లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. 33 కేవీ భూగర్భ విద్యుత్ కేబుల్‌ను ఎంవీపీ కాలనీ సబ్ స్టేషన్ నుంచి వెంకోజీపాలెం కూడలి వరకు నిర్మించనున్నట్లు సంస్థ ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో రూ.30 కోట్లతో చేపట్టనున్న భూగర్భ విద్యుత్ కేబుల్ ప్రాజెక్టుల్లో ఈ లైన్ ఒకటన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంగవేణి, టీడీపీ నాయకుడు పట్టాభి, సంస్థ ఎస్ఈ శ్యాంబాబు, ఈఈ సింహాచలం నాయుడు, ఈఈ వేణుగోపాలరావు, డీఈఈ సుమన్, ఏఈఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుపై అవగాహన



సచివాలయంలో దరఖాస్తుదారులకు సూచనలిస్తున్న డీఎస్‌వో భాస్కరరావు

మహారాణిపేట: సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి(డీఎస్‌వో) వి.భాస్కరరావు శుక్రవారం నగరంలోని పలు సచివాలయాలను సందర్శించారు. అక్కడ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారితో మాట్లాడారు. వారికి సలహాలు, సూచనలు అందజేశారు. రేషన్ కార్డు మంజూరుకు ఏమేం కావాలో అవగాహన కల్పించారు. దండుబజార్ సచివాలయంలో కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసిన వారితో మాట్లాడి పలు సూచనలిచ్చారు.

సామాజిక భవనాల కోసం ఎదురుచూపులు



28వ వార్డు పితానిదిబ్బలో నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు

- పితానిదిబ్బ, భానోజీనగర్ ప్రాంతాల్లో నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు
- వాటిని తొలగించి కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని స్థానికుల వినతి
- ప్రజాకాంక్షను పట్టించుకోని పాలకులు, అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

బీచ్‌రోడ్డు: మల, మూత్ర విసర్జన కోసం బహిరంగ ప్రదేశాలను వినియోగించకూడదనే ఉద్దేశంతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ప్రతి ఇంటి వద్ద టాయిలెట్లు నిర్మించుకోవడంతో ప్రజా మరుగుదొడ్ల అవసరం లేక నిరుపయోగంగా మిగిలాయి. ఇవి మందుబాబులు, ఆకతాయిలకు ఆసరాగా ఉండటంతో అక్కడే మద్యం తాగడం, గంజాయి సేవించడం వంటివి చేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎటువంటి ఉపయోగం లేని ఈ మరుగుదొడ్లను తొలగించి వాటి స్థానంలో సామాజిక భవనాలు నిర్మించాలని జీవీఎంసీ 28వ వార్డు పితానిదిబ్బ, భానోజీనగర్ ప్రాంతాల వాసులు కోరుతున్నారు. వారి ఆకాంక్షను అటు కూటమి పాలకులు.. ఇటు జీవీఎంసీ అధికారులు నెరవేర్చడం లేదు.



ప్రజా మరుగుదొడ్ల వద్ద మద్యం సీసాలు

మరుగుదొడ్ల చుట్టూ మద్యం సీసాలు

పితానిదిబ్బ, భానోజీనగర్ ప్రాంతాల్లోని ప్రజా మరుగుదొడ్ల వద్ద జన సంచారం లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పట్టపగలు సైతం ఇక్కడ కొందరు మద్యం తాగుతున్నారు. ఈ టాయిలెట్ల చుట్టూ మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. కొంత మంది యువకులు ఇక్కడే గంజాయి సేవిస్తూ తిష్ట వేస్తున్నారు. వీరి ఆగడాలతో చుట్టపక్కల నివాసులు అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

6 నెలలుగా ఎదురుచూపు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవడం లేదు. సామాజిక భవనాలు నిర్మించాలని గత ఆరు నెలలుగా పితానిదిబ్బ, భానోజీనగర్ వాసులు ఎదురు చూస్తున్నారు. తమకు అవసరం లేని మరుగుదొడ్లను తొలగించి.. అవసరమైన కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని పదే పదే వినతి పత్రాలు అందిస్తున్నారు. అయినా సరే అధికారుల నుంచి ఎటువంటి చర్యలు లేవు.

కౌన్సిల్ సమావేశంలో చర్చ

నిరుపయోగంగా పడి ఉన్న ఈ రెండు మరుగుదొడ్లను కూల్చి సామాజిక భవనాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వందలాది ఇళ్లు ఉన్న ఈ ప్రాంతాల్లో ఎటువంటి కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో చిన్న చిన్న వేడుకలు, కార్యక్రమాలకు ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఈ విషయాన్ని వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ దృష్టికి పితానిదిబ్బ, భానోజీనగర్ వాసులు తీసుకెళ్లారు. ఈ అంశంపై ఆమె జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. స్థానికులు ఎదుర్కొంటున్న మరుగుదొడ్ల సమస్యలపై చర్చించారు. అయినాసరే అధికారుల్లో మాత్రం ఎటువంటి చలనం లేదు.



కౌన్సిల్‌లో సమస్యపై మాట్లాడుతున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ (ఫైల్)



భానోజీనగర్‌లో వినియోగం లేని సామాజిక మరుగుదొడ్లు

కష్టంగా నిర్వహణ

భానోజీనగర్, పితానిదిబ్బ ప్రాంతాల్లో స్థానికుల కోసం రెండు ప్రజా మరుగుదొడ్లు జీవీఎంసీ నిర్మించింది. కాలక్రమేణ నివాసులందరూ ఇంట్లో మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. దీంతో సామాజిక మరుగుదొడ్ల అవసరం లేక నిరుపయోగంగా పడి ఉన్నాయి. రోజుకు ఈ రెండు మరుగుదొడ్లను 20 మంది కూడా వినియోగించడం లేదు. దీంతో మరుగుదొడ్ల నిర్వహణ కూడా కష్టంగా మారంది. వీటి తలుపులు కూడా విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. కొన్ని టాయిలెట్ల గదులకు పూర్తిగా తలుపులు లేవు. దీంతో వాటిని వినియోగించడానికి వస్తున్న ఒకరిద్దరు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.



తలుపులు లేని, ధ్వంసమైన మరుగుదొడ్లు

స్వచ్ఛ సర్వేక్షణ్ నుంచి తొలగించాలి

ఈ రెండు ప్రజా మరుగుదొడ్లను జీవీఎంసీ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగం చేసింది. నిరుపయోగంగా ఉన్న వీటిని స్వచ్ఛ సర్వేక్షణ్ నుంచి తొలగించి సామాజిక భవనాలు నిర్మించాలని అప్పటి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ కు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు వినతిపత్రం అందజేశారు. ఈ మరుగుదొడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తున్నాయని, వాటి వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్ బదిలీ కావడంతో ఈ సమస్యను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. పాలకులు, అధికారులు స్పందించి ప్రజాప్రయోజనార్థం సామాజిక భవనాలు నిర్మించాలని పితానిదిబ్బ, భానోజీనగర్ వాసులు కోరుతున్నారు.

రద్దీ మార్గంలో రోడ్డుపైనే జనరేటర్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని నిత్యం రద్దీగా ఉండే రహదారిపైన భారీ జనరేటర్‌ను ఏర్పాటు చేయడంతో వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానం నుంచి ఉషోదయ కూడలి వైపు వెళ్లే మార్గంలో ఓ ఆస్పత్రి నిర్వాహకులు ఈ జనరేటర్‌ను ఫుట్‌పాత్‌ను ఆనుకొని పర్మినెంట్‌గా రోడ్డుపైనే వదిలేశారు. ప్రైవేట్ ఆస్పత్రి కోసం వినియోగిస్తున్న ఈ భారీ జనరేటర్‌ను నెలల తరబడి రోడ్డుపైనే ఉంచి ఆపరేట్ చేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జనరేటర్‌కు సమీపంలోనే కొన్ని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతోపాటు భారీ భవన నిర్మాణం జరుగుతుండటం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. ఇదే అదునుగా ఆస్పత్రి యాజమాన్యం రోడ్డుపైనే జనరేటర్‌ను ఉంచేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. టౌన్ ప్లానింగ్ సిబ్బంది కానీ, ట్రాఫిక్ పోలీసులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి జనరేటర్‌ను తొలగించాలని, భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్డుపై నిల్వ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎంవీపీ కాలనీలో ఫుట్‌పాత్‌ను ఆనుకొని రోడ్డుపై ఏర్పాటు చేసిన భారీ జనరేటర్

శివాజీపాలెంలో శుభ్రత చర్యలు



కాలువ శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు



శివాజీపాలెంలో చెత్త తొలగిస్తున్న కార్మికురాలు

బీచ్‌రోడ్డు: రెండు వార్డులకు మధ్య ఉన్న శివాజీపాలేన్ని పారిశుధ్య కార్మికులు పట్టించుకోవడం లేదు. దీంతో ఈ ప్రాంతం ఎప్పుడు పారిశుధ్య లోపంతో అధ్వానంగా ఉంటోంది. 20వ వార్డులో కొంత భాగం.. 22వ వార్డులో కొంత భాగమైన శివాజీపాలెంలోని కాలువలు, పరిసరాలను ఎవరు శుభ్రం చేయాలో తెలియక గాలికొదిలేస్తున్నారు. దీంతో విసుగు చెందిన స్థానికులు 20వ వార్డు కార్పొరేటర్ ముVVల లక్ష్మీ సురేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి అక్కడికి పారిశుధ్య కార్మికులను పంపించారు. వారు ఆ ప్రాంతంలోని చెత్తతోపాటు మొత్తం కాలువలను శుభ్రం చేశారు. ఎన్నో రోజుల నాటి తమ ప్రాంత సమస్య పరిష్కారం కావడంతో శివాజీపాలెం వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు భారంగా ప్రైవేటు వైద్యం

సీఎంకు ఈఏఎస్ శర్మ లేఖ


మహారాణిపేట: ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్‌లు చార్జ్ చేస్తున్న ఫీజులు భరించలేక పేద ప్రజలు అప్పులపాలవుతున్నారని, అటువంటి ప్రైవేట్ సంస్థలపై కఠినమైన నియంత్రణ అవసరమని కేంద్ర ప్రభుత్వ విశ్రాంత కార్యదర్శి ఈఏఎస్ శర్మ అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం శర్మ లేఖ రాశారు. ప్రభుత్వ రంగంలో ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలు, శిక్షణ సంస్థలను స్థాపించే దిశలో కావాల్సిన నిధులను రాష్ట్రప్రభుత్వం కేటాయించాలని కోరారు. కేజీహెచ్ విషయంలో గత నెల 24న ఒక లేఖ రాశానని గుర్తు చేశారు. అక్కడి వైద్యులు సామాజిక స్పృహతో సేవలందిస్తున్నప్పటికీ.. సౌకర్యాలు లేకపోవడం కారణంగా ఆసుపత్రి ప్రాంగణంలో రద్దీ ఉంటోందన్నారు. దీని వల్ల రోగులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని అందులో ప్రస్తావించినట్లు చెప్పారు. పేద ప్రజలు.. ప్రైవేటు ఆసుపత్రులు వసూలు చేసే ఫీజులు, ఇతర ఖర్చులను భరించలేరన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు ప్రైవేటు ఆసుపత్రులలో ఉచితంగా సౌకర్యాలు లభించే అవకాశం ఉన్నా.. ప్రైవేటు ఆసుపత్రుల్లో అదనంగా ఉండే ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న పేద ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యాలు అందించడం లేదని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

సింహగిరిపై ఒడిశా భక్తుల సందడి

అప్పన్నకు నిత్య కల్యాణం జరిపించిన దానుడు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న లక్ష్మీకాంత్‌నాయక్ దాస్



పూజల్లో పాల్గొన్న ఒడిశా భక్తులు

సింహాచలం: సింహగిరిపై నిత్యకల్యాణం ప్రాంగణం ఒడిశా భక్తులతో కిటకిటలాడింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిపించిన నిత్యకల్యాణంలో పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు విశేష పూలాలంకరణ చేసి వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ వింజామరతో స్వామికి సేవలందించారు. భక్తులకు స్వామి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు బీచ్ రోడ్డులో యోగా ఈవెంట్

మహారాణిపేట: యోగాంధ్ర వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులోని శాశ్వత వేదిక వద్ద జిల్లా స్థాయి యోగా ఈవెంట్ జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈవెంట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు.

పిఠాపురం కాలనీలో శానిటైజేషన్



పిఠాపురం కాలనీలో అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌ను శానిటైజ్ చేస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో కోవిడ్ మొదటి కేసు నమోదైన పిఠాపురం కాలనీలో శుక్రవారం అధికారులు శానిటేషన్ నిర్వహించారు. ముఖ్యంగా కోవిడ్ వచ్చిన మహిళ నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో శానిటేషన్ చేశారు. అపార్ట్‌మెంట్ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరూ జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

పది రోజులుగా పేరుకుపోయిన చెత్త



పెదవాల్తేరు - చినవాల్తేరు రహదారిలో ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన చెత్త

బీచ్‌రోడ్డు: నాలుగు ప్రభుత్వ ఆస్పత్రులు ఉండే ప్రధాన రహదారిలో పది రోజులుగా చెత్త తొలగించడం లేదు. జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరు నుంచి చినవాల్తేరుకు వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌పై భారీగా చెత్త పడేశారు. రోజురోజుకూ అక్కడ చెత్త పేరుకుపోతున్న పారిశుధ్య కార్మికులు దానిని తరలించడంలో అలసత్వం వహిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు సమీపంలోనే చెత్త పేరుకుపోవడంతో రోగులకు మరింత ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. పారిశుధ్య అధికారులు స్పందించి వెంటనే చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలు అవసరమా..?

ఏయూ హెచ్‌వోడీల సమావేశంలో ఇదే చర్చ

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీల అవసరం ఏ మేరకు ఉందనేది మరోమారు చర్చకు దారి తీసింది. ఏయూ క్యాంపస్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో శుక్రవారం సమావేశమైన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అంతర్గతంగా జరిగిన సమావేశం కావడంతో వివరాలు గోప్యంగా ఉంచారు. ఈ నెల 28న రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్‌లతో నిర్వహించే సమావేశానికి సమగ్ర నివేదికలతో హాజరు కావాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఇక్కడి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏయూలో జరిగిన సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది. వర్సిటీలోని విభాగాల వారీగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు లెక్క తీసిన వీసీ రాజశేఖర్ ఒకింత విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విభాగాల్లో ఇంతమంది అవసరమా..? అని ప్రశ్నిస్తూనే.. వారిలో బోధనా నైపుణ్యత ఎంత ఉందనేది తెలుసుకునేందుకు మరోమారు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో అనుభవజ్ఞులను కొనసాగిస్తూనే.. కొత్తగా తీసుకునేందుకు ఎలా ముందుకెళ్లాలనే దానిపై అందరి అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలోని అన్ని విభాగాల్లో కలిపి సుమారుగా 400 వరకు గెస్ట్ ఫ్యాకల్టీలు పనిచేస్తున్నారు. వీరిలో కొంతమందిని పద్ధతి ప్రకారం కాకుండా హెచ్‌వోడీలు తమకు నచ్చిన రీతిలో నియమించేశారనే ఫిర్యాదులు సైతం ఉన్నాయి. దీనిపై ఫోకస్ పెట్టిన ప్రస్తుత వైస్ చాన్సలర్.. విభాగాల్లో ఎంతమంది అవసరం..? ఎవరిని ఉంచాలి..? ఎవరిని తీసేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో కొంతమంది గెస్ట్ ఫ్యాకల్టీలు అప్పుడే లాబీయింగ్‌లను మొదలుపెట్టారు. వీసీపై ఒత్తిడి తీసుకొచ్చి.. తాము కొనసాగేలా పావులు కదుపుతున్నారు.

ప్రమాదకరంగా గెడ్డలు, కాలువలు

- అదుపు తప్పి వాటిలోకి దూసుకుపోతున్న వాహన చోదకులు
- రక్షణ గోడలు నిర్మించాలని 10వ వార్డు వాసుల వినతి



పాత డెయిరీఫారం వద్ద పోస్టాఫీస్ వీధిలో రక్షణ గోడ లేని పెద్ద కాలువ



డెయిరీఫారం పెట్రోల్ బంక్ - ఇందిరానగర్ రహదారిలో రక్షణ గోడ లేని గెడ్డ



ఇందిరానగర్ ఆర్చ్ వద్ద రక్షణ గోడ లేక ప్రమాదకరంగా మారిన గెడ్డ భాగం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో పలుచోట్ల గెడ్డలు, కాలువలకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారాయి. వీటివల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వాహన చోదకులు చిన్నపాటి అజాగ్రత్తతో వాటిలో పడి గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పాత డెయిరీఫారం దరి పోస్టాఫీస్ రోడ్డుకు ఒక పక్క లోతైన పెద్ద కాలువ ఉంది. దానిని ఆనుకుని సీసీ రోడ్డు నిర్మించారు. ఇక్కడ రక్షణ గోడ లేకపోవడంతో వాహన చోదకులు అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీఫారం పెట్రోల్ బంక్ నుంచి ఇందిరానగర్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డు పక్కన గెడ్డది కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ రోడ్డు పక్కన రక్షణ గోడ లేకపోవడంతో వాహన చోదకులు రాత్రిళ్లు తరచూ ఈ గెడ్డలోకి దూసుకుపోయి ప్రమాదాల పాలవుతున్నారు. దీని నుంచి ఇందిరానగర్ కాలనీకి వెళ్లడానికి ఆర్చ్ వద్ద ఉన్న మలుపులో కాలువ అంచు శిథిలమైంది. దీంతోపాటు దానికి రక్షణ గోడ కూడా నిర్మించలేదు. ఈ కాలనీకి వెళ్లే వాహన చోదకులు ఇక్కడ మలుపు తిరుగుతుండగా అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోతున్నారు. తరచూ ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఆయాచోట్ల రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



రక్షించిన పర్యాటకులతో లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్: ఆర్కే బీచ్‌లో విషాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు సరదాగా గడిపేందుకు బీచ్‌కు వచ్చారు. వారిలో నలుగురు సముద్రంలో మునిగిపోతూ ఉండగా జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ వెంటనే స్పందించి కాపాడారు. జీవీఎంసీ ఇన్‌చార్జి స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు తెలిపిన వివరాలివి. హైదరాబాద్ నుంచి వచ్చిన షబ్బీర్, అబ్బాస్, ఇద్రిస్, హుస్సేన్ అనే యువకులు శుక్రవారం ఉదయం ఆర్కే బీచ్‌లో స్నానానికి దిగారు. అయితే సముద్ర అలల ఉధృతికి వారు నీటిలో మునిగిపోవడం గమనించిన బీచ్ లైఫ్‌గార్డ్స్ ధనరాజు, నవీన్, ఆనంద్, లక్ష్మణరావు, కేవీ వాసు వెంటనే రంగంలోకి దిగారు. నలుగురు యువకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం వారికి ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం వారిని పంపించివేశారు.